పేదల ఇళ్లు కూల్చేందుకే సుందరీకరణ కుట్ర

ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్

చిక్కడపల్లి: సుందరీకరణ పేరుతో మూసీ పరీవాహక ప్రాంతంలో పేద, మధ్య తరగతి ప్రజల ఇళ్లు కూల్చే కుట్ర చేయడం దారుణమని ఎమ్మెల్యే ముఠా గోపాల్ మండిపడ్డారు. మంగళవారం గాంధీనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూసీ బాధితులకు బీఆర్‌ఎస్ అండగా ఉంటుందన్నారు. ఈ విషయంలో ఇప్పటికే బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారని తెలిపారు. మూసీ పరీవాహక బస్తీలల్లో మూన్నాల్లు దశాబ్దాల నుంచి నివాసం ఉంటున్న వారి ఇళ్లను కూల్చాలని చూడటం దారుణమని మండిపడ్డారు.

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆందోళనలు, ఆక్రందనలు..

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆందోళనలు, ఆక్రందనలతో హైదరాబాద్ అల్లకల్లోలంగా మారిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మూసీ ప్రాజెక్టు పేరిట లక్షల మందిని రోడ్డున పడేలా చేస్తున్నారని విమర్శించారు. గత సీఎం కేసీఆర్ పదేళ్ల పాలనలో ప్రశాంతంగా ఉన్న నగరం నేడు అల్లకల్లోలంగా మారిందన్నారు. ఈ సమావేశంలో ముఠా జైసింహ, ప్రభాకర్, రాకేష్‌కుమార్, ముఠా నరేశ్, శంకర్ పాల్గొన్నారు.



నేతాస్ @ లంచ్ బ్రేక్.!

చిక్కడపల్లి: గాంధీనగర్‌లోని ఎమ్మెల్యే ముఠాగోపాల్ నివాసానికి మంగళవారం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ వచ్చారు. ఎమ్మెల్యే తనయుడు ముఠా జైసింహ ఆధ్వర్యంలో లంచ్ ఏర్పాటు చేశారు. కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, సుధీర్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి, మాజీ మంత్రి మహమూద్ అలీ, మాజీ ఎంపీ బాల్కసుమన్, మాజీ ఐటీ చైర్మన్ సీహెచ్ రాకేష్, గెల్లి శ్రీనివాస్‌యాదవ్, సబిత ఇంద్రారెడ్డి తనయుడు కార్తీక్‌రెడ్డి తదితరులు వచ్చారు. దీంతో ఎమ్మెల్యే నివాసం బయట వద్ద సందడి నెలకొంది.

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిపై కేటీఆర్ విమర్శలు తగవు

- మేమంతా మూసీ నిర్వాసితులకు అండగా ఉంటున్నాం
- హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు డాక్టర్ గౌతంరావు

కాచిగూడ: బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేదల గురించి ఆలోచించకుండా కేవలం రాజకీయ లబ్ధి కోసం ఆలోచించడం సిగ్గు చేటని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు అన్నారు. మంగళవారం బర్కత్‌పురలోని పార్టీ నగర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... అంబర్‌పేట నియోజకవర్గంలో మూసీ పరీవాహక ప్రాంతాల పర్యటనకు వచ్చిన కేటీఆర్... పేదలను ఇబ్బందులకు గురి చేస్తున్న కాంగ్రెస్ గురించి మాట్లాడకుండా కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిపై విమర్శలు చేయడం దుర్మార్గమని అన్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఒక్కసారి కూడా ప్రజల వద్దకు వెళ్లి భరోసా కల్పించిన పాపాన పోలేదని విమర్శించడం తగదన్నారు. జమ్ము కశ్మీర్ ఎన్నికల నేపథ్యంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి నగరానికి రాలేని పరిస్థితి ఉండటంతో బీజేపీ కార్యకర్తలను ఎప్పటికప్పుడు మూసీ పరీవాహక ప్రాంతాలకు పంపిస్తున్నారని అన్నారు. మూసీ నిర్వాసితులకు బీజేపీ నాయకులు ధైర్యం చెబుతూ అండగా నిలుస్తున్నారని అన్నారు. గత బీఆర్‌ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ పేదల స్థలాలు లాక్కొని అన్యాయం చేస్తున్నాయని విమర్శించారు.

సాంఘిక భద్రత అందరి హక్కు

నాస్ జాతీయ కన్వీనర్ పి.చెన్నయ్య



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నాస్ జాతీయ కన్వీనర్ పి.చెన్నయ్య

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: సాంఘిక భద్రత అందరి హక్కు అని ఇది రాజ్యాంగం కల్పించిన హక్కు అని నేషనల్ అలయన్స్ ఫర్ సోషల్ సెక్యూరిటీ (నాస్) జాతీయ కన్వీనర్ పి.చెన్నయ్య అన్నారు. మంగళవారం సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో నాస్ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు పొందడానికి ఎవరి దయా దాక్షిణ్యాలు అవసరం లేదన్నారు. పనిచేసి సంపాదిస్తున్న వారంతా కార్మికులుగా గుర్తింపు పొందే హక్కు ఉందని చెప్పారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులందరిని గుర్తించి వారికి సాంఘిక భద్రత కల్పించాలన్నారు. సంక్షేమ పథకాలన్నీ అందించాలని కోరారు.

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే అన్ని సంక్షేమ పథకాలలో అసంఘటిత కార్మికులు లబ్ధిపొందే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అసంఘటిత రంగంలో కార్మికుల నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు ఆదేశించిందని గుర్తు చేశారు. 16 సంవత్సరాలు పైబడిన అసంఘటిత రంగలోని కార్మికులందరిని గుర్తించి నమోదు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ వెంకటయ్య, డీబీఎఫ్‌పీ శంకర్, వివిధ సంఘాల నాయకులు కళ్యపద్మ, ఆశాలత, లక్ష్మి, మీరా సంఘమిత్ర తదితరులు పాల్గొన్నారు.

డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ ప్రారంభం



బాగ్‌లింగంపల్లిలో డ్రైవింగ్ శిక్షణను ప్రారంభిస్తున్న అనిల్‌కుమార్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: కేశవస్మృతి సంవర్ధన సమితి, కేశవ నిలయం సంయుక్త సహకారంతో నిర్వహిస్తున్న ఉచిత డ్రైవింగ్ 15వ బ్యాచ్‌ను మంగళవారం ప్రారంభించారు. ఎలిట్ డ్రైవింగ్ స్కూల్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమాన్ని ప్రముఖ పారిశ్రామికవేత్త అనిల్‌కుమార్ ప్రారంభించారు. యువత స్వయం ఉపాధి వైపు పయనించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కె. ఉపేందర్, కొప్పారపు బాలయ్య, రామచంద్ర, సునీల్ కులకర్ణి, అరవింద్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు



చోటి కుమారిని అభినందిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ చిరంజీవి

కాచిగూడ: హైదరాబాద్ జిల్లా స్థాయి యూత్ ఫెస్టివల్‌లో హ్యాండీక్యాప్‌లో కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని చోటి కుమారి రెండో బహుమతిని సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో ప్రిన్సిపల్ ఎ.చిరంజీవి ఆమెను అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు వి.ప్రసాద్‌రావు, బాలమణి, రజిని, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బి.లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



మందులు అందజేస్తున్న కార్పొరేటర్ అమృత

నల్లకుంట: స్వచ్ఛంద సేవా సంస్థలు ఏర్పాటు చేసు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని నల్లకుంట కార్పొరేటర్ వై. అమృత సూచించారు. మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని సేవా పక్వాడాలో భాగంగా నల్లకుంట బీజేపీ ఆధ్వర్యంలో బర్కత్‌పుర వుడ్‌ల్యాండ్స్ ఆసుపత్రి సౌజన్యంతో స్థానిక భాగ్యనగర్ బస్తీలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రరమంలో ఆసుపత్రి ఎండీ డా. సురేష్‌గౌడ్, బీజేపీ వైద్య విభాగ్ పరిషత్ కార్యదర్శి డాక్టర్ వినోద్, బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ కేజే. బాబు, డివిజన్ కన్వీనర్ కేటీ. నర్సింగ్‌రావు, నాయకులు ధర్మేందర్, నరేష్, లత, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ బ్రిడ్జిపై బైక్ వీలింగ్ చేసిన ముగ్గురి అరెస్టు

ప్రమాదకరంగా వాహనాలు నడిపితే కఠిన చర్యలు: ఇన్‌స్పెక్టర్ సీతయ్య



పోలీసుల అదుపులో ముగ్గురు బైక్ రైడర్లు, మూడు బైక్‌లు

సాక్షి ఎఫెక్ట్..



సెప్టెంబర్ 20వ తేదీన సాక్షిలో ప్రచురితమైన కథనం

చిక్కడపల్లి: సాక్షి దినపత్రికలో గత నెల 20వ తేదీన 'రై'డర్' అనే వార్తకు స్పందించిన చిక్కడపల్లి పోలీసులు స్టీల్‌బ్రిడ్జిపై ముగ్గురు ఆకతాయిలను మంగళవారం ఆరెస్టు, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ సీతయ్య, ఎస్సై నాగరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.... స్టీల్ బ్రిడ్జిపై ప్రమాదకరంగా బైక్ వీలింగ్ చేసిన మల్కాజ్‌గిరికి చెందిన ఎండీ జైనుల్లాలుద్దీన్, మీర్ గజాన్‌ఫర్ ఆలీ, గజ్జాన్‌ఫర్ ఆలీ, ఎస్‌కే మతిన్‌లతో పాటు బైక్ రైడింగ్‌కు ఉపయోగించిన ఆర్‌ఎక్స్ 100, ఎంటీ 15 యమహా, అపాచీ ఆర్టీఆర్ 180 మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వారిపై బీఎన్‌ఎస్, మోటార్ వెహికిల్ యాక్ట్ ప్రకారం పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ బైక్ రైడర్స్‌ను ఛేదించిన ఎస్.ఐ నాగరాజు బృందం పీసీలు సుజన్, శ్రీకాంత్, హరిలను సీఐ సీతయ్య అభినందించారు. ఇన్‌స్పెక్టర్ సీతయ్య మాట్లాడుతూ... ఎవరైనా ప్రమాదకరంగా వాహనాలు నడుపుతూ బైక్ రైడింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే 100, స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రేపు పోపూరి శంకర శర్మ జయంతి

నల్లకుంట: ప్రముఖ సంగీత విద్వాంసుడు, శ్రీ సరస్వతి సంగీత విద్యాలయం వ్యవస్థాపకుడు దివంగత పోపూరి శంకర శర్మ 104వ జయంతిని 3వ తేదీన నిర్వహించనున్నట్లు అధ్యాపకులు యశస్విని, తేజస్విని మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బాగ్ అంబర్‌పేటలోని శ్రీషిరిడీ సాయిబాబా మందిరంలోని రెండో అంతస్తులో సాయంత్రం 5.30 గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. దీనికి ముఖ్య అతిథులుగా బుల్లితెర దర్శక నిర్మాత శోభాశంకర్, విష్ణు సహస్రనామ బృందం సభ్యుడు పోపూరి కామేశ్వర శర్మ హాజరవుతారని చెప్పారు. ఈ సందర్భంగా పంచశత వీణా గానరత్న పోపూరి శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో దివంగత శంకర శర్మ రచించి స్వరపరిచిన కీర్తనల గానం ఉంటుందన్నారు. అదే విధంగా సంగీత విద్వాంసులకు ఆత్మీయ సత్కారం ఉంటుందని తెలిపారు.

13న వరల్డ్ బెస్ట్ టీచర్ ఇంటర్నేషనల్ అవార్డు ప్రదానోత్సవం

ఈ నెల 5వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ, సామాజిక సాంస్కృతిక సేవా సంస్థ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో అక్టోబర్ 5న వరల్డ్ టీచర్స్ డేను పురస్కరించుకొని ఈనెల 13వ తేదీన నగరంలో వరల్డ్ బెస్ట్ టీచర్ ఇంటర్నేషనల్ అవార్డు 2024 ప్రదానోత్సవం నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ డా. ఈఎస్‌ఎస్ నారాయణ మాస్టర్ తెలిపారు. విద్యార్థులకు విద్యతో పాటు సాహిత్య సాంస్కృతిక, కళా, క్రీడా రంగాలలో ఉత్తమ శిక్షణ ఇస్తూ మంచి పౌరులుగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులను సత్కరిస్తున్నట్లు చెప్పారు. అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్రస్థాయి పురస్కారాల ఎంపికకు ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 5లోపు సంస్థ కార్యాలయాలలో సంప్రదించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ నం.96523 47207లో సంప్రదించాలన్నారు.

స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌ను కలిసిన ట్రస్మా నూతన కార్యవర్గం



కవాడిగూడ: ఇటీవల నూతనంగా ఎన్నికైన తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) రాష్ట్ర నూతన కార్యవర్గం తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డిని మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. బడ్జెట్ పాఠశాలల సమస్యలను వివరించినట్లు ట్రస్మా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎన్ రెడ్డి, కె.శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ప్రైవేటు పాఠశాలల సమస్యలను పరిష్కరించి కార్పొరేట్ పాఠశాలలను నియంత్రించాలని కోరినట్లు పేర్కొన్నారు. దీనిపై డైరెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా గౌరవ అధ్యక్షుడు కందాల పాపిరెడ్డి, అధికార ప్రతినిధి చింతల రాంచందర్, పి.రాంనర్సయ్య, బానాల రాఘవ, జయరాం, ప్రసాద్, వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రగతిశీల విద్యార్థి సంఘాలు ఐక్యంగా పోరాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న పోటు రంగారావు

ముషీరాబాద్: దేశానికి ప్రమాదకరంగా మారుతున్న మతోన్మాద పాసిజాన్ని దేశంలోని లౌకిక, ప్రగతిశీల విద్యార్థులంతా ఐక్యంగా ప్రతిఘటించాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ కేంద్ర పొలిట్ బ్యూరో సభ్యుడు, రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్ విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో దేశవ్యాప్తంగా ఉన్న ప్రగతిశీల విద్యార్థి సంఘాల ముఖ్య ప్రతినిధుల విస్తృతస్థాయి సమావేశం ప్రియంబస్సు (పశ్చిమబెంగాల్) పెద్దింటి రామకృష్ణ(తెలంగాణ), మనోజ్‌టిక్రీ(అస్సాం)ల అధ్యక్షతన జరిగింది. సమావేశం ప్రారంభానికి ముందు పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు నామాల ఆజాద్, విద్యార్థి అమర్‌లను స్మరిస్తూ సంతాప తీర్మానం చేపట్టారు. దేశ ప్రజల కనీస అవసరాలు తీర్చకుండా అందరినీ మతం మత్తులో ముంచుతున్నారని ఆరోపించారు. ప్రజల ఐక్యతకు ప్రమాదకరంగా మారుతున్న విషయాలను ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. వివిధ రాష్ట్రాల విద్యార్థి సంఘం నేతలు అన్వేష్, అహీర్, నదిత, తిమ్మన్న, హన్మంతు షిండే, తిరుపతి, భవానీ, పీడీఎస్‌యూ ఏపీ నాయకులు రాజేష్, తెలంగాణ నాయకులు నర్సింహ్మారావు, భాస్కర్, నరేందర్ పాల్గొన్నారు.

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు

చిక్కడపల్లి: వివేక్‌నగర్ ఆంజనేయస్వామి దేవాలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని ఈఓ దేవనాథం తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ.. ఈనెల 3 నుంచి 12 వరకు ఉత్సవాలు జరుగుతాయన్నారు. 3న బాలాత్రిపురసుందరిగా, 4న మహలక్ష్మిగా, 5న గాయత్రీదేవీగా, 6న రాజరాజేశ్వరీ దేవీగా, 7న అన్నపూర్ణాదేవీగా, 8న మంగళగౌరీదేవిగా, 10న దుర్గాదేవిగా, 11న మహిషాసురమర్ధినిదేవిగా, 12న లలితాదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారన్నారు. ప్రతిరోజు రాత్రి 8గంటలకు భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు.

దేవీ శరన్నవరాత్రుల కరపత్రాల ఆవిష్కరణ



ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కందూరి కృష్ణ, బాలరాజుగౌడ్



ఆవిష్కరిస్తున్న చైర్మన్ గౌతంకుమార్, ఈవో సాంబశివరావు, ప్రధానార్చకులు సాత్విక్ శర్మ

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: నేతాజీ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు చిక్కడపల్లిలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద నిర్వహించే దేవీ శరన్నవరాత్రి మహోత్సవం కరపత్రాన్ని మంగళవారం నిర్వాహకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహక కమిటీ అధ్యక్షులు కందూరి కృష్ణ, చైర్మన్ బాలరాజుగౌడ్, ఉపాధ్యక్షులు వందన రాజగోపాల్, కోశాధికారి ఉదయ్‌కుమార్ గుప్తా, హరీష్‌గుప్తా, సజ్జన, వల్లభ, శివరామకృష్ణ గౌడ్, చంద్రమోహన్‌గౌడ్, సాగర్, అనిల్ గుప్తా, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

కనకాల కట్టమైసమ్మ దేవాలయ..

కవాడిగూడ: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు లోయర్ ట్యాంక్‌బండ్‌లోని కనకాల కట్టమైసమ్మ దేవాలయంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఫౌండర్ చైర్మన్ గోల్కొండ గౌతంకుమార్ పటేల్, ఆలయ ఈవో సాంబశివరావు తెలిపారు. మంగళవారం దేవాలయ ఆవరణలో నవరాత్రి ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాన్ని ఆలయ ప్రధార్చకులు సాత్విక్ శర్మ, ఆలయ సీనియర్ అసిస్టెంట్ సతీష్‌కుమార్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఈనెల 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. 10రోజుల పాటు లలిత సహస్ర నామార్చన నిర్వహిస్తామని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జీహెచ్ఎంసీ, వాటర్‌వర్క్స్, ట్రాన్స్‌కో అధికారులకు సౌకర్యాలు కల్పించాలని కోరామన్నారు.

రైల్లో ప్రయాణికురాలి నగదు, నగలు చోరీ

కాచిగూడ: రైల్లో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికురాలి నగదు, నగలుతో ఉన్న బ్యాగు చోరికి గురైంది. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... అఫ్జల్‌గంజ్ ప్రాంతానికి చెందిన పద్మ (55) కుటుంబ సభ్యులతో అంజతా ఎక్స్‌ప్రెస్ రైల్లో నాగర్‌సోల్ నుంచి కాచిగూడకు ప్రయాణం చేస్తున్నారు. రైలు ధర్మాబాద్‌కు వచ్చిన తర్వాత చూసుకునే సరికి బ్యాగు కనిపించలేదు. బ్యాగులో రెండు తులాల బంగారు చైన్స్, రూ.6వేల నగదు, మొబైల్ ఫోన్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. పద్మ మంగళవారం కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ కింద కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం నాందేడ్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు కేసు బదిలీ చేశారు.

అసిస్టెంట్ ప్రొ. రుమాండ్ల లావణ్యకు డాక్టరేట్



ముషీరాబాద్: విద్యానగర్‌లోని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్‌లో రుమాండ్ల లావణ్య అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఓయూలో పీహెచ్‌డీ అడ్మిషన్ పొంది డాక్టర్ ఎం.వాసవీ పర్యవేక్షణలో "ఐడెంటిఫికేషన్ ఆఫ్ నావెల్ లీడ్ మోలిక్యూలెస్ ఫర్ ట్యూబర్‌సీలోసిస్ టార్గెట్స్ బై అప్లయింగ్ కంప్యూటర్ ఎయిడెడ్ డ్రగ్ డిస్కవరీ టెక్నిక్స్" అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ పరిశోధనకు మెచ్చిన ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్‌ను ఆమెకు ప్రదానం చేసింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొ. కె.ప్రభు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వర్, రసాయన శాస్త్ర అధ్యాపకులు గుండు మల్లికార్జున్, కె.తిరుపతయ్య తదితరులు లావణ్యను అభినందించారు.

నేషనల్ ఫ్లోర్ కర్లింగ్ పోటీలకు రాష్ట్ర క్రీడాకారులు

కాచిగూడ: నేషనల్ ఫ్లోర్ కర్లింగ్ చాంపియన్‌షిప్-2024 పోటీలు పుదుచ్చేరిలో ఈనెల 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు ప్రారంభం కానున్నాయని కర్లింగ్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అధ్యక్షుడు డా. రొయ్యూరు సురేష్, ప్రధాన కార్యదర్శి వసంత మాధురి తెలిపారు. తెలంగాణ నుంచి 8మంది క్రీడాకారులు బీఎం పవన్‌కుమార్, ఎం.నాగ అక్షయ, మేజర్ పద్మజ, ఎం.లక్ష్మీచైతన్య, జి.కృష్ణమూర్తి, ఆర్.ప్రత్యూష, టి.అనుదీప్‌రెడ్డి, వి.వసంత మాధురి ఎంపిక అయ్యారని తెలిపారు.

బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని వినతి

కాచిగూడ: స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లను 20 శాతం నుంచి 42 శాతానికి పెంచాలని తెలంగాణ బీసీ ఫ్రంట్ చైర్మన్ గొరిగే మల్లేష్‌యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మల్లేష్‌యాదవ్ నేతృత్వంలో బీసీ నేతలు చెరుకుల రాజేందర్, నీల వెంకటేష్, పగిళ్ల సతీష్, రవికుమార్ యాదవ్, బలరాం, వివ, మణికంఠ తదితరులు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని సచివాలయంలో కలిసి బీసీల సమస్యలపై చర్చించారు. అనతరం బీసీల డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. హైకోర్టు ఇచ్చిన తీర్పును ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు. మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు.

రైతు హామీల సాధన దీక్షకు మద్దతుగా..



ఇందిరాపార్కు వద్ద జరిగిన రైతు హామీల సాధన దీక్షకు బీజేపీ ఎస్సీ మోర్చా ముషీరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ పరుశురాములు ఆధ్వర్యంలో మంగళవారం ఎస్సీ మోర్చా నేతలు కార్యకర్తలు పెద్ద ఎత్తున ర్యాలీగా తరలివెళ్లి మద్దతు తెలియజేశారు. – కవాడిగూడ

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



చిక్కడపల్లి: డివిజన్ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకుంటామని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్ అన్నారు. మంగళవారం డివిజన్‌లోని హరిత అపార్ట్‌మెంట్ వీధి డ్రైనేజీ పొంగిపొర్లడంతో స్థానికులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆమె ఘటనా స్థలానికి చేరుకుని వాటర్ వర్క్స్ అధికారులకు సమస్యను వివరించగా.. సిబ్బందితో కలిసి మరమ్మతులు చేయించారు. వాటర్‌వర్క్స్ మేనేజర్ కృష్ణమోహన్, ఇన్‌చార్జి శంకర్, బీజేపీ నేతలు బాలకృష్ణ, ఆనంద్‌రావు, జ్ఞానేశ్, స్థానికులు రామకృష్ణ, నర్సింహ, శారద, పద్మావతి, గిరి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

అనువాద దినోత్సవం



అనువాదకులు ఎలనాగను సన్మానిస్తున్న ప్రముఖ కవి, కళారత్న బిక్కి కృష్ణ తదితరులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: చిక్కడపల్లిలో భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్, రఘు ఆరికపూడి సేవా ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ అనువాద దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా అనువాద రంగంలో విశేష కృషి చేసిన ఎలనాగ, రంగనాథ, రామచంద్రారావు, శ్రీనివాస్‌గౌడ్, మారెపల్లి భువనేశ్వరి, లలిత వర్మ, ఉషారాణితో పాటు పలువురిని జాతీయ జీవన సాఫల్య పురస్కారంతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఇన్‌కమ్ ట్యాక్స్ చీఫ్ కమిషనర్ నర్సింహప్ప సీనియర్ పాత్రికేయులు భగీరథ రచించిన నాగలాదేవి నవలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహప్ప మాట్లాడుతూ... ప్రేమకు పట్టం కట్టిన నవల నాగలాదేవి అని అన్నారు. ఈ దశాబ్దపు అత్యున్నత నవలగా ఆయన అభివర్ణించారు. ప్రముఖ కవి, కళారత్న బిక్కి కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ నాలేశ్వరం శంకరం, డాక్టర్ జ్యోత్స్న ప్రభ, డాక్టర్ జల్ది విద్యాధర్, పి. విజయలక్ష్మి పండిట్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబురం

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండగ అని న్యూ ఎర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ శ్రావణ్‌కుమార్ అన్నారు. మంగళవారం చిక్కడపల్లిలోని సెయింట్ ఆడమ్స్ హైస్కూల్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ఆడుతూ పాడుతూ పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించారు. అనంతరం శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ.. అమ్మ మమ్మల్ని చల్లగా చూడమ్మ అని వేడుకునే దినమే ఈ బతుకమ్మ పండగని అన్నారు. ఈ బతుకమ్మ పండుగ నేడు ప్రపంచ వ్యాప్తంగా మంచి గుర్తింపు పొందిందన్నారు.



బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తున్న సెయింట్ ఆడమ్స్ పాఠశాల విద్యార్థులు



దుర్గామాత వేషధారణలో..

అంబర్‌పేట: బతుకమ్మ,దేవీ శరన్నవరాత్రుల ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలిసేలా మంగళవారం ప్రేమ్‌నగర్‌లో హైమావతి పాఠశాలలో వేడుకలను నిర్వహించినట్లు కరస్పాండెంట్ హైమావతి, ప్రిన్సిపాల్ నిరంజన్ అన్నారు. ఈ సందర్భంగా బతుకమ్మ తయారు చేసి ఆడిపాడారు. ఓ విద్యార్థిని దుర్గామాత వేషధారణలో అందరినీ ఆకట్టుకుంది.



హైమావతి పాఠశాలలో..

హైమావతి పాఠశాలలో బతుకమ్మ సంబురాల్లో విద్యార్థులు